క్లుప్తంగా

నాభిశిలా ప్రతిష్టకు రూ.1.50 లక్షల విరాళం



నిర్వాహకులకు చెక్కు అందిస్తున్న మద్దిలేటి

కర్నూలు(అర్బన్): నగర శివారులోని పెద్దపా డు రోడ్డు ఇందిరాగాంధీ కాలనీ ఎల్లమ్మ గుడి సమీపంలో అక్టోబర్ 1వ తేదీన నాభిశిల (బొడ్రాయి) ప్రతిష్టకు వైఎస్సార్‌సీపీ నాయకులు, పర్లకు చెందిన మద్దిలేటి రూ.1.50 లక్షల విరాళాన్ని చెక్కు రూపంలో అందించారు. గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్ర మంలో ఆయన మాట్లాడుతూ.. నాభిశిల ప్రతి ష్టాపన రోజున ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యావాహచనం, కంకణధారణ, ఋత్వి క్ వరుణం, మృత్సంగ్రహణం, కలశస్థాపన, యంత్రాభిషేకం, ఆదివాసాలు, హోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారన్నారు. అలాగే మధ్యాహ్నం 1 గంటకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాభిశిలా కమిటీ సభ్యులు ప్రకాష్, రాము, రామక్రిష్ణ, చాంద్ భాష, లక్ష్మన్న, చిన్న మద్దిలేటి పాల్గొన్నారు.

22 నుంచి దేవీ శరన్నవరాత్రులు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ పేర్కొన్నారు. ప్రతి రోజు అమ్మవారికి ప్రాతఃకాలంలో అభిషేకాలు, విశేష అర్చనలు, లలితా సహ స్రనామార్చనలు, కుమారి, సువాసినీ పూజ లు, చండీ సప్తసతి పారాయణం ఉంటుందని తెలిపారు. 22న బాలా త్రిపుర సుందరీ అలంకారం వక్కలతో అర్చన, 23న అన్నపూర్ణాదేవి కి పసుపు కొమ్మలతో అర్చన, 24న గాయత్రీ దేవి అలంకారం కొబ్బరి కాయలతో అర్చన, 25న మహాగౌరీ దేవి అలంకారం గాజులతో అర్చన, 26న మహాలక్ష్మి, ధనలక్ష్మి అలంకారం, 27న లలితా త్రిపుర సుందరి అలంకారం, రవికలతో అర్చన, 28న రాజశ్యామల అలంకా రం, సువాసిపూజ, 29న సరస్వతి పూజ, పుస్తక పూజ, 30న మహాదుర్గ అలంకరణ, నిమ్మకా యలతో అర్చన, అక్టోబర్ 1న చండీ హోమం మహా పూర్ణాహుతి, తమలపాకులతో అర్చన, 2న విజయదశమి రాజరాజేశ్వరి అలంకరణ, శమీ పూజ కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.

అక్రమ అరెస్టులపై ఖండన

కర్నూలు(సెంట్రల్): ఆదోని మెడికల్ కాలేజీని ప్రైవేట్‌పరం చేయరాదని కోరుతూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నట్లు డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేసేందుకు పూనుకుందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని వాపోయారు.

20న దెబ్బతిన్న పంటల పరిశీలన

కర్నూలు(సెంట్రల్): భారీ వర్షాలకు దెబ్బతిన్న ఉల్లి, పత్తి, టమాటా, వేరుశనగ, ఆముదం తదితర పంటలకు సరైన గిట్టుబాటు ధరను కల్పించేందుకు ఏపీ రైతు సంఘం జిల్లాలోని గ్రామగ్రామాన తిరిగి నష్టాన్ని లెక్కించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉల్లి క్వింటాలుకు ప్రభుత్వం ప్రకటించిన రూ.1200 మద్దతు ధర ఏమాత్రం సరిపోదన్నారు. కనీసం రూ.3 వేలను మద్దతు ధరగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే ఉల్లిని కొనుగోలు చేయాలని, వ్యాపారులు కొన్ని లాట్లను మాత్రమే కొనుగోలు చేస్తుండడంతో రైతులకు కనీస మద్దతు ధర రూ.1200 దక్కడం లేదన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం నేరుగా రైతుల నుంచి ఉల్లిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

పన్ను వేయాలంటే లంచం ఇచ్చుకోవాల్సిందే!



కమిషనర్ పి.విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు (టౌన్): కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17వ వార్డు జొహరాపురం 40వ వార్డు అడ్మిన్ ఇంటి పన్ను వేయాలంటే లంచం డిమాండ్ చేస్తున్నారని సీపీఎం నగర కార్యవర్గ సభ్యులు విజయ రామాంజనేయులు కాలనీ బాధితులతో కలిసి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం స్థానిక నగరపాలక కార్యాలయంలో కమిషనర్ పి.విశ్వనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జొహరాపురంలో కూలీ పనులు చేసే వారి వద్ద ఇంటి పన్ను వేసేందుకు రూ.5 వేలు, మధ్య తరగతి ప్రజలకు రూ.10 వేలు డిమాండ్ చేస్తున్నారని లేకుంటే పన్నులు వేయడం లేదని ఆరోపించారు. స్పందించిన కమిషనర్ విచారణ చేయించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ తీరుతో ఉద్యోగార్థులకు ముప్పతిప్పలు

- ప్రచార ఆర్భాటం కోసం రూ.కోట్ల ఖర్చు
- డీఎస్సీ ఉద్యోగార్థుల ఎంపికలో పారదర్శకత ఏదీ?
- వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం చుక్కలు చూపిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి విమర్శించారు. పాలన చేపట్టిన దాదాపు ఏడాదిన్నర తరువాత డీఎస్సీ అభ్యర్థుల ఎంపిక, నియామక పత్రాలు అందజేయడంలో ప్రభుత్వం ఉద్యోగార్థులను ముప్పు తిప్పలు పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం తన కార్యాలయంలో మాట్లాడుతూ.. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రిజిస్టర్ పోస్టులో లేదా ఆన్‌లైన్ ద్వారా నియామక పత్రాలు అందజేస్తే సరిపోతుందన్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ప్రచార యావతో 16 వేల మంది ఉద్యోగార్థులను, వారితో పాటు సహాయకులను విజయవాడకు రావాలని, వారందరికీ బస్సులు ఏర్పాటు చేసి, భోజనాల పేరుతో వందల కోట్లు ఖర్చు చేయడం ఎంత వరకు సమంజసం అన్నారు. కేవలం ప్రచారం కోసమే ఇదంతా చేస్తున్నారని మండిపడ్డారు. విజయవాడకు వెళ్లేందుకు అందరినీ జిల్లా కేంద్రానికి రమ్మని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు రద్దు చేసినట్లు తాపీగా ప్రకటించిందని యద్దేవా చేశారు. ఇదేమైన పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చే కార్యక్రమమా అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒకేసారి 1.30 లక్షల ఉద్యోగాలు ఇచ్చినప్పటికీ ప్రజాధనం దుర్వినియోగం చేయకుండా నియామక పత్రాలు అందజేశారన్నారు. ఎందుకంత ప్రచార ఆర్భాటం.. ఎందుకంత ఖర్చు చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మొదటి నుంచి డీఎస్సీ అభ్యర్థుల విషయంలో గందరగోళం నెలకొందన్నారు. ఉద్యోగార్థుల జీవితాలతో ఆడుకోవద్దని సూచించారు.

అరెస్టు పేరుతో మహిళలను వేధించడం తగదు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 10వ వార్డు కార్పొరేటర్ షేక్ యూనుస్ బాషాపై అక్రమ కేసు పెట్టిన పోలీసులు ఆ ఇంట్లోని మహిళలను వేధించడం తగదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం పాతబస్తీలోని ఉస్మానియా కళాశాల సమీపంలో ఉన్న కార్పొరేటర్ ఇంటికి ఆయన వెళ్లారు. కుటుంబసభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సంబంధం లేని కేసులు పెట్టి పోలీసులు ఇబ్బందులు పెడుతున్నారని ఆ ఇంట్లోని మహిళలు ఎస్వీ దృష్టికి తెచ్చారు. పోలీస్‌స్టేషన్‌కు రావాలంటూ తమను భయాందోళనకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ.. మహిళలను ఇబ్బంది పెట్టడం మంచి పద్ధతి కాదన్నారు. గతంలో ఎప్పుడూ ఇటువంటి పరిస్థితులు లేవన్నారు. టీడీపీ నేతల ఒత్తిడితో ఉద్దేశపూర్వకంగా మహిళలను ఇబ్బంది పెట్టడం తగదన్నారు. పోలీసులకు అన్ని తెలుసు అని, కార్పొరేటర్‌పై పెట్టిన అక్రమ కేసుల్లో ఎవరు రౌడీషీటర్ అన్న సంగతి అందరికీ తెలుసన్నారు. పరిస్థితులు ఎప్పుడూ ఒకేలాగే ఉండవని స్పష్టం చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఎల్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు



కానుకల లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ

కర్నూలు(రూరల్): వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయంలో హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఆలయ మండపం వద్ద తాలుకా అర్బన్ పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దల సమక్షంలో అధికారుల అధ్వర్యంలో లెక్కింపు చేపట్టగా శ్రీదేవ సేవా సంస్థ వారు పాల్గొన్నారు. ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా మొత్తం రూ.14,44,284 ఆదాయం వచ్చినట్లు కార్యనిర్వహణ అధికారి ఎ.రాధాక్రిష్ణ తెలిపారు. పర్యవేక్షణ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, గార్గేయపురం ఏపీజీబీ బ్రాంచ్ మేనేజర్ అన్వర్, అర్చకులు చిన్నయ్య, నారాయణ, యల్లారాజు, బాలు, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎస్‌జీఎఫ్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్‌అథారిటీ స్టేడియంలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 విభాగంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్–19 జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టార్గెట్ మార్షల్ ఆర్ట్స్, రెజ్లింగ్, తైక్వాండో వంటి క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆయా స్కూల్ యజమాన్యాల నుంచి అనుమతి పత్రం తీసుకొనిరావాలని, 2007 జనవరి 1 తరువాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు.

టీడీపీ నేతల మెప్పు కోసమే విద్యార్థులపై దాడి



మాట్లాడుతున్న గౌస్ దేశాయ్

కర్నూలు (సెంట్రల్): పేదలకు, అట్టడుగు వర్గాలకు ఉన్నత విద్య దక్కడం కోసం విద్యార్థులు తమ ఘోషను వెళ్లబోసుకుంటే, అధికార పార్టీ మెప్పు కోసం పోలీసులు హైరానా చేస్తూ విద్యార్థులపై దాడి చేయడం హేయమైన చర్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ విమర్శించారు. గురువారం ఇందిరాగాంధీ నగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పోలీసులు వెంటనే బేషరతుగా క్షమాపణలు చెప్పాలన్నారు. విద్య కోసం విద్యార్థులు వెళ్తే, రాజకీయం కోసం వచ్చిన టీడీపీ నాయకుల మెప్పు కోసం విద్యార్థులపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. సీపీఎం కార్యవర్గ సభ్యులు పీఎస్ రాధాకృష్ణ, జి.రామకృష్ణ, ఎండీ ఆనంద్‌బాబు, కె.వెంకటేశ్వర్లు, ఎండీ అంజిబాబు పాల్గొన్నారు.

గాయత్రి హాస్పిటల్‌లో విచారణ

కర్నూలు (హాస్పిటల్): నగరంలోని కొత్తబస్టాండ్ వద్ద ఉన్న గాయత్రి హాస్పిటల్‌లో సీఐడీ అధికారులు విచారణ చేస్తున్నారు. గతంలో ఈ హాస్పిటల్‌లో పక్షవాతం కేసులకు సంబంధించి అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తా యి. ఈ మేరకు గతంలోనే అప్పటి ఆరోగ్యశ్రీ అధికారులు, అనంతపురం వైద్యులు విచారణ చేసి నివేదిక ఇచ్చారు. ఈ మేరకు సదరు హాస్పిటల్‌ను సీజ్ చేయడంతో పాటు నిందితులపై కేసు నమోదు చేశారు. ఈ కేసు పూర్తిస్థాయిలో విచారణ చేసేందుకుగాను తిరిగి సీఐడీ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లును సీఐడీ అధికారులు కలిసి ఒక రేడియాలజిస్టు, ఒక న్యూరాలజిస్టును విచారణ నిమిత్తం పంపాలని కోరారు.

కష్టపడే వారికి గుర్తింపు



కాటసాని రాంభూపాల్‌రెడ్డిని పూలమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కల్లూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కష్టపడే వారందరికి తప్పనిసరిగా పదవులు వరిస్తాయని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ సెక్రటరీగా నియమితులైన బి. బాలగంగాధర్ గురువారం కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో పదవులు పొందిన వారందరూ పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

తల్‌సైనిక్ క్యాంప్‌లో క్యాడెట్ల ప్రతిభ



క్యాడెట్లు మనీషా, హిమబిందుకు జ్ఞాపికలను బహుకరిస్తున్న కల్నల్ జోబీ ఫిలిప్

కర్నూలు కల్చరల్: న్యూఢిల్లీలో ఇటీవల ముగిసిన తల్‌సైనిక్ క్యాంప్ –2025లో 9 ఆంధ్ర బాలికల బెటాలియన్ క్యాడెట్లు ఇద్దరు సీనియర్ వింగ్ క్యాడెట్లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రశంసలు అందుకున్నారు. ఈ మేరకు గురువారం 9 ఆంధ్ర బాలికల బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ క్నలల్ జోబీ ఫిలిప్ క్యాడెట్లు మనీషా, హిమబిందును అభినందించి నగదు బహుమతులు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిల్వర్ జూబ్లీ కళాశాలలో డిగ్రీ చదవుచున్న క్యాడెట్లు తల్‌సైనిక్ క్యాంప్‌లో పాల్గొని ఆయా ఈవెంట్లలో బంగారు పతకాలు సాధించి 9 ఆంధ్ర బాలికల బెటాలియన్‌కు, కళాశాలకు గర్వకారణంగా నిలిచారన్నారు. అంతకు ముందు బెటాలియన్ ఉద్యోగులు, క్యాడెట్లు, వారి తల్లిదండ్రులు, కళాశాల ఉద్యోగులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): నగరంలో అనధికార లేఔట్లను ఎల్‌ఆర్‌ఎస్ పథకం ద్వారా ప్రజలు క్రమబద్ధీకరించుకునేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ టౌన్ ప్లానింగ్, సచివాలయాల సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగర పరిధిలో 150 కిపైగా అనధికార లేఔట్లు ఉన్నాయని, వాట న్నింటినీ తప్పనిసరిగా క్రమబద్ధీకరించుకునేందు కు చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా ప్లానింగ్, అమినిటీస్, వెల్ఫేర్ కార్యదర్శులు సంయుక్త బృందంగా ఏర్పడి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. నగరంలో అక్రమ నిర్మాణాలు ఉండకూడదని, ఫిర్యాదులు వస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డీసీపీ వెంకటరమణ, పట్టణ ప్రణాళిక విభాగంఅధికారి అంజాద్ బాషా పాల్గొన్నారు.

జీవనశైలి మార్చుకోవాలి

కల్లూరు: కొన్ని రకాల వ్యాధులు రాకుండా ఉండాలంటే జీవనశైలిని మార్చుకోక తప్పదని అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ మహేశ్వర ప్రసాద్ సూచించారు. గురువారం పర్ల గ్రామంలో సంచార చికిత్స కార్యక్రమాన్ని పరిశీలించి, అక్కడ అందిస్తున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మధుమేహం రావడానికి ప్రధాన కారణం వంశపారపర్యం లేదా మానసిక ఒత్తిడి, వృత్తిపరమైన ఒత్తిడి అన్నారు. అలాగే తరచూ జంక్ ఫుడ్ తినడం, వ్యాయామం లేకపోవడం, శారీరక శ్రమ చేయలేక పోవడమన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీదేవి, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

జీవనశైలి మార్పుతోనే వ్యాధులు



వృద్ధురాలికి బీపీ పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): మానవుని జీవన విధానం మారడంతోనే రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్, గుండెజబ్బులు వంటి వ్యాధులు వస్తున్నాయని అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ మహేశ్వర ప్రసాద్ చెప్పారు. గురువాంం స్థానిక ఇందిరమ్మ హౌసెస్ యూపీహెచ్‌సీ పరిధిలోని బాబా బృందావన్ నగర్‌లో నిర్వహిస్తున్న ఎన్‌సీడీ 4.ఓ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్‌సీడీ 4లో భాగంగా రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, పక్షవాతం, క్యాన్సర్లను ముందస్తుగా గుర్తించాలని సిబ్బందికి సూచించారు. సర్వేలో అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షల స్క్రీనింగ్ పక్కాగా నిర్వహించి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటం వల్ల ఈ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి చికిత్స అందిస్తే విముక్తి పొందవచ్చని చెప్పారు. క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తే వెంటనే స్క్రీనింగ్ చేయాలన్నారు. కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రికి ప్రతి మంగళవారం, గురువారం ఓపీ నంబర్ 222కు రెఫర్ చేయాలన్నారు. ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్, ఆరోగ్య కార్యకర్త వెన్నెల, ఆశా, కవిత, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన పిల్లలతో దేశ భవిష్యత్



మాట్లాడుతున్న డాక్టర్ మాధవీశ్యామల

కర్నూలు(హాస్పిటల్): ఆరోగ్యవంతమైన పిల్లలతోనే దేశ భవిష్యత్ అని స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కర్నూలు మెడికల్ కాలేజీ నోడల్ అధికారి డాక్టర్ మాధవీశ్యామల అన్నారు. గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని చిన్నపిల్లల విభాగంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధవీ శ్యామల మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న 11 రకాల టీకాల ద్వారా 12 రకాల వ్యాధుల నుంచి పిల్లలను రక్షించుకోవచ్చన్నారు. ప్రతి తల్లి టీకా కోసం పిల్లలను తీసుకెళ్లినప్పుడు విధిగా ఇమ్యునైజేషన్ కార్డు తీసుకెళ్లాలని, షెడ్యూల్ ప్రకారం టీకా వేయించుకుంటేనే పూర్తి ఫలితాలు ఉంటాయని తల్లులకు చెప్పారు. టీకాల వల్లే పోలియో, మశూచి, ధనుర్వాతం వంటి వ్యాధులను చాలా వరకు నివారించగలిగామన్నారు. టీకాల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా తల్లులు విధిగా పిల్లలకు టీకాలు వేయించాలన్నారు. పీడియాట్రిక్ విభాగ ప్రొఫెసర్లు డాక్టర్ సుహాసిని, డాక్టర్ శారద, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీలత, డాక్టర్ ప్రకాష్ పాల్గొన్నారు.

చిన్నారికి సొంత ఖర్చుతో వైద్యం



కోలుకున్న చిన్నారి శివరాణితో వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): ప్రమాదవశాత్తూ మెట్లపై నుంచి జారిపడి తలకు తీవ్ర గాయమైన చిన్నారికి వైద్యులే సొంత ఖర్చుతో శస్త్రచికిత్స చేసి ప్రాణం పోశారు. వివరాలను మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి వివరించారు. తెలంగాణ రాష్ట్రం గద్వాలకు చెందిన మహేష్, జ్యోతి దంపతుల రెండేళ్ల కుమార్తె శివ రాణి ఈ నెల 5వ తేదీన ఇంట్లో టవల్‌తో ఆడుకుంటూ మెట్లపై నుంచి అదుపు తప్పి కింద పడటంతో తలకు తీవ్రగాయమైంది. స్థానికంగా ప్రథమ చికిత్స అనంతరం కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. సీటీ స్కాన్ తీయగా చిన్నారి మెదడులో రక్తం గడ్డ కట్టినట్లు గుర్తించారు. తక్షణమే ఆపరేషన్ చేయాలని తల్లిదండ్రులకు చెప్పారు. తమకు ఆర్థిక స్థోమత లేదని వెనుదిరుగుతుండగా వారిని ఆపి న్యూరోసర్జన్ డాక్టర్ విశ్వకుమార్ సొంత ఖర్చుతో ఆపరేషన్ చేసి ప్రాణం పోశారు. చిన్నారిని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చేర్చి నియోనెటాలజిస్టు డాక్టర్ సింధూరరెడ్డి పర్యవేక్షణలో చికిత్స అందించారు. పాప కోలుకోవడంతో గురువారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.


జీపీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ వర్కర్లు

కర్నూలు(సెంట్రల్): గ్రామ పంచాయతీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఏపీ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ వర్కర్లతో ప్రభుత్వం వెట్టి చాకిరి చేయిస్తోందన్నారు. కనీస వేతనం రూ.26 వేలతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని కోరారు. మరోవైపు ఖాళీగా ఉన్న వర్కర్ల పోస్టులను భర్తీ చేసి పనిభారం తగ్గించాలని కోరారు. అనంతరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

కులగణన చేపట్టాలి




మాట్లాడుతున్న బి.గిడ్డయ్య

కర్నూలు(సెంట్రల్): జనగణనలో కులగణనను చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. గురువారం సీఆర్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. వెనకబడిన తరగతులకు సంబంధించి 143 కులాలు ఉన్నాయని, శ్రమశక్తితో సంపదను సృష్టించే వెనుకబడిన తరగతులను యంత్రాలు మాదిరిగానే చూస్తున్నారే తప్పా రాజ్యాధికారంలో భాగస్వామ్యం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భాగస్వామ్యం చేయాలంటే ఏ కులంలో ఎంతమంది ఉన్నారు? ఎక్కడ నివాసం ఉంటున్నారు? వారి ఆచార వ్యవహారాలు? వారి వృత్తి? జీవన విధానం ఏమిటనేది తెలియాలన్నారు. క్రమంలో బీసీ జనాభా గణన చేస్తే ఆయా కులాల పూర్తి వివరాలు బయటకు వస్తాయన్నారు. అప్పుడే జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించి రాజకీయాల్లో భాగస్వామ్యం చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో జరిపే జనగణనలో కులగణన కూడా చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు రామాంజనేయులు, ధనలక్ష్మీ పాల్గొన్నారు.

స్థల వివాదంలో సర్పంచ్ భర్త దాడి

కర్నూలు(రూరల్): స్థల వివాదంలో సర్పంచ్ భర్త ఇద్దరిపై చెయ్యి చేసుకున్నాడు.మండల పరిధిలోని పంచలింగాల స్కంద వెంచర్ 42 ఎకరాల్లో 180 కుటుంబాలు నివశిస్తున్నాయి. వెంచర్‌లో అభివృద్ధికి కేటాయించిన స్థలం 1.80 సెంట్లు ఆక్రమణకు గురవుతోందని ఒక వర్గం వారు గత వారం పీజీఆర్‌ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇదే విషయంపై గతంలో లోక్తయుక్తను ఆశ్రయించినట్లు సమాచారం. ఈ క్రమంలో గురువారం ఉదయం పంచలింగాల సర్పంచ్ మాధవి, భర్త క్రిష్ణా యాదవ్ ఆ స్థలంలో పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటుండగా సదరు వర్గం వారు రెవెన్యూ, పోలీస్, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు వివాదాస్పద స్థలంలో పూజా కార్యక్రమం విరమించుకోవాలని సూచించారు. దీంతో ఆగ్రహానికి గురైన సర్పంచ్ భర్త క్రిష్ణయాదవ్, రఫీ ఫిర్యాదుదారులైన ప్రసాద్, మజీద్‌లపై చెయ్యి చేసుకున్నారు. దీనిపై బాధితులు కర్నూలు అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థల పంచాయితీ స్టేషన్‌కు చేరడంతో పోలీసులు, రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు అక్కడికి చేరుకుని అందరినీ బయటకు పంపి గేటుకు తాళం వేసి సమస్య సద్దుమణిగేలా చేశారు.

ఆర్‌పీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



నూతన కమిటీ సభ్యులతో పి.నిర్మల

కర్నూలు(సెంట్రల్): మెప్మా ఆర్పీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, శ్రామిక మహిళా సంఘం రాష్ట్ర నాయకులు పి.నిర్మల డిమాండ్ చేశారు. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో ఏపీ మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం మూడో నగర మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెంటనే ఆర్పీలకు పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రూ.26 వేల వేతనంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించి ఆదుకోవాలన్నారు. రాజకీయ నాయకుల వేధింపులను నివారించేందుకు పర్మినెంట్ చేయాలన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఉచితంగా వైద్యం చేయించాలన్నారు. అనంతరం 15 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్ షబాన, లక్ష్మీబాయిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సాయిబాబా, శ్యామలమ్మ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు

కర్నూలు(సెంట్రల్): బ్రిటీషు పాలకుల నుంచి మాతృభూమి విముక్తి కోసం ప్రాణాలు అర్పించిన యువ కిశోరం సర్దార్ భగత్‌సింగ్ 118వ జయంతి (సెప్టెంబర్ 28) పురస్కరించుకొని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 27న నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈ.శ్రీరాములు, కె.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం సీఆర్ భవన్‌లో ఏఐవైఎఫ్ ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. భగత్‌సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. ప్రస్తుతం కూటమి పాలనలో యువతకు అడుగడుగునా అన్యాయం జరుగుతోందని వాపోయారు. నాయకులు బీసన్న, కృష్ణ, చంటి, అఖిల్, సూర్య మధు తదితరులు పాల్గొన్నారు.